ప్రజావీక్షణం
విలేకర్లు కావలెను
అనుభవజ్ఞులు, జర్నలిజం పై ఆసక్తి ఉన్న వారికి అవకాశం
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400

# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :150 24 శుక్రవారం, ఏప్రిల్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

- యువత పట్టుదలతో ముందుకు సాగాలన్న మంత్రి వాకిటి



హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కానీ మారుతిసాగర్ తదితరులు పాల్గొన్నారు.భగీరథ జయంతి వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడుతున్నాం అన్నారు.సగరులు సమస్యల పరిష్కారం కోసం ముందుంటాం అన్నారు. కలియుగంలో కూడా భగీరథుని ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగుతున్నాం అని వెల్లడించారు. శివుని తలలో ఉండే గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహానీయులు భగీరథుడు అని అన్నారు. భగీరథ ప్రయత్నం అంటూ నేటి సమాజం ముందుకు సాగుతుంది బసవేశ్వరుడు పనిలోనే దేవుడు ఉన్నారని చెబితే..

## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

- ఆర్టీసీ సమ్మెపై కేబినేట్ భేటీలో ప్రస్తావన
- నేడు చర్చలు జరపాలని డిప్యూటి సిఎంకు ఆదేశం
- అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని
- శ్రీధర్ బాబు వినతి



హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది.

మిగతా 2 లో

## బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

- మే4న రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతాం
- ప్రశాంత వాతారణంలో ఎన్నికలు జరగడం విశేషం
- నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



కోల్‌కతా,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు.పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది.

మిగతా 2 లో

## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

- చొరబాట్లను పూర్తిగా నిరోధిస్తాం
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా కీలక వ్యాఖ్యలు

కోల్‌కతా,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)



పశ్చిమ బెంగాల్‌లో ఈసారి అధికారం భాజపాదేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. తొలి విడత పోలింగ్ ముగుస్తున్న తరుణంలో బెంగాల్‌లో తాము పూర్తి మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం రాగానే చొరబాట్లను పూర్తిగా కట్టడి చేస్తామని అన్నారు. ఇంతకాలం మమతా బెనర్జీ చొరబాట్లను ప్రోత్సహిస్తూ దేశ బవిష్యత్‌కు సవాల్ విసిరారని మండిపడ్డారు.

మిగతా 2 లో

## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

గజ్వేల్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)



సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...

## ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

- డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు చెక్
- ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)



ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతా 2 లో

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

- హైకోర్టు తీర్పు పుణ్యం రేవంత్ రెడ్డిదే
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమంటూ వ్యాఖ్యానించారు. గురువారంఆయన మాట్లాడుతూ..

మిగతా 2 లో

## మూడోరోజు సింగపూర్‌లో మంత్రుల పర్యటన

- ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శించిన బృందం

అమరావతి,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)



ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్‌లో మూడో రోజు గురువారం పర్యటిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పీఎస్ఏను సందర్శిం చింది. పోర్టు నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను ఏ విధంగా వినియోగి స్తున్నారో మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సింగపూర్‌లోని ఖాం ఆధ్వర్యంలో నడుస్తున్న టువాస్ (తుఅంతూ) పోర్ట్.. 2040 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమేటెడ్ టెర్మినల్‌గా రికార్డు సృష్టించబోతోంది.

మిగతా 2 లో

## తమిళనాట పోటెత్తిన ఓటరు

- దాదాపు 83శాతం పోలింగ్ నమోదు
- ఓటింగ్ ప్రక్రియ ముగిసాక పెరగవచ్చని అంచనా
- సిఎం అభ్యర్థుల నియోజకవర్గాల్లో 80శాతం దాటిన పోలింగ్

చెన్నై,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

తమిళనాడు ఓటర్లు చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు.. తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## కాళేశ్వరం పేరుతో తెలంగాణ సొమ్ము నాశనం

- హైకోర్టు తీర్పుపై ఎందుకు సంబరాలు చేస్తున్నారు
- త్వరలోనే సంరాల రాంబాబులను లోపలేయడం ఖాయం
- మీడియా సమావేశంలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)



కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు.

మిగతా 2 లో

# బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాదే విజయం

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిమబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్ ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణనగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను. కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

## కాళేశ్వరం పేరుతో తెలంగాణ సొమ్ము నాశనం

మొదటిపేజీ తరువాయి

గురువారం మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్ధాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు. '24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయిందన్నారు. సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్ఏ చెప్పిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయిందన్నారు. నాణ్యత పాటించకుండా ప్రాజెక్ట్ కట్టి.. కూలిపోగానే కాంగ్రెస్‌పై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రమ్మన్న అంశంపై మాత్రమే కోర్టు అభ్యంతరం తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అప్పు పుట్టకపోతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి అప్పు తెచ్చారని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్మేది

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లు ఫామ్‌హౌస్‌లో పడుకుని ఇప్పుడు మళ్లీ కేసీఆర్ మోటార్లకు మీటర్లు అంటున్నారని కేంద్ర మంత్రి సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికులకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

మొదటిపేజీ తరువాయి

ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటావార్పు, 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుకమ్మలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

## ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు కారిడార్

మొదటిపేజీ తరువాయి

సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ – విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## మూడోరోజు సింగపూర్‌లో మంత్రుల పర్యటన

మొదటిపేజీ తరువాయి

ఈ పోర్టులో అమలవుతున్న వినూత్న పద్ధతులను మంత్రుల బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేసింది. పోర్టులో కంటైనర్లను ఒక చోటు నుంచి మరొక చోటికి తరలించడానికి ఉపయోగిస్తున్న డ్రైవర్ లేని ఎలక్ట్రిక్ వాహనాల పనితీరును చూసి మంత్రులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారీ క్రేన్లను ఆపరేటర్లు నేరుగా కాకుండా.. రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రించే విధానాన్ని పరిశీలించారు. షిప్పింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ వ్యవస్థల ద్వారా కార్యకలాపాలను ఎలా వేగవంతం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ అధ్యయన పర్యటనలో రాష్ట్ర మంత్రులు నారాయణ, బి.సి. జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.

## బెంగాల్లో ఇక అధికారం బిజెపిదే

మొదటిపేజీ తరువాయి

హుగ్లీ జిల్లాలోని బాలాగఢ్‌లో ఏర్పాటు చేసిన రెండో విడత ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మే 5న దీదీ ఆట ముగుస్తుంది. భాజపా ప్రభుత్వం పూర్తి మెజార్టీతో ఏర్పాటవుతుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, భద్రతకు చొరబాటుదారులు హాని కలిగిస్తున్నారు. బెంగాల్ యువత ఉద్యోగాలు, పేదల రేషన్‌ను దోపిడీ చేయడంతో పాటు దేశ భద్రతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 29న (రెండో విడత ఎన్నికల్లో) కమలం గుర్తుపై ఓటేయండి. ఇది మీరు కేవలం ఎవరో ఒకరిని ఎమ్మెల్యేని చేసేందుకో, భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికో కాదు.. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించడానికి. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బెంగాల్‌లోకి ఎవరూ చొరబడలేరు. ఇప్పటికే అక్రమ వలసదారులను భాజపా బయటకు పంపిస్తోందని అన్నారు. మరోవైపు, బెంగాల్‌లో జరుగుతున్న తొలి విడత ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3గంటల సమయానికి 78.77శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో ఈ రోజు ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. చివరి వార్తలు అందేసరికి బెంగాల్లో 79శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలుస్తోంది.

ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు చీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# పాఠశాల విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ లు అందజేసిన రజని

**బాపట్ల : ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం) :**

బాపట్ల మండలం ముత్తయిపాలెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు గురువారం జరిగిన ఫేర్ వెల్ పార్టీకి ముఖ్య అతిథి సమాజ సేవకురాలు బంద్రేడ్డి రజని హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్ లను అందజేశారు.అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు మరియు ఉపాధ్యాయినీలు కలిసి రజనిని సత్కరించారు.వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.







# దిష్టిబొమ్మల ఐమాక్స్ లైట్లు..

## - పట్టించుకోని మున్సిపల్ అధికారులు..

**దేవరకద్ర : ఏప్రిల్ 23 (ప్రజా విక్షణం)**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఐమాక్స్ లెట్లు దిష్టిబొమ్మల ఉన్నాయి. స్థానిక తీగల కట్ట వద్ద ఉన్న ఐమాక్స్ లైట్లు మరమతులు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కూడా ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి వెంటనే ఐమాక్స్ లైట్లు మరమతులు చేసి కాంతిని వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఆర్టీసీ సమ్మెపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

## ఇచ్చిన హామీ మేరకు నడుచుకోవాలి

## మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి డిమాండ్

**నిజామాబాద్,ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**



ఆర్టీసీ కార్మికుల సమ్మె డిమాండ్లను పరిష్కరించకపోతే తెలంగాణలో 'మరో సకల జనుల సమ్మె' తప్పదని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. కమిటీలతో ఇంకా ఎంతకాలం తమను మభ్యపెడుతూ, కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర సాధనలో అగ్రభాగా ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడానికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఒక్కసారి ఆర్టీసీ ప్రైవేట్‌పరమైతే ప్రజలకు భారం తప్పదని హెచ్చరించారు. ఇది ఒక ఆర్టీసీ కార్మికుల సమస్య కాదని, యావత్తు తెలంగాణ ప్రజల సమస్య అని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల విలీనంపై సర్కార్ వైఖరేమిటో చెప్పాలని ప్రశ్నించారు. అధికారుల కమిటీ ఎలాంటి సమస్యలకూ పరిష్కారం చూపలేదని తెలిపారు. తమను పిలిచిన చర్చల్లో ఒక్క మంత్రి లేరని, అందుకే ఐఏఎస్ అధికారుల కమిటీ చేతులెత్తేసిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా సకల జనుల మద్దతు ఉన్నదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేయకుండా చేతల్లో తమ పనితనం చూపించాలని డిమాండ్ చేశారు. నాడు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ఇప్పుడు వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

# మహిళలే మహారాణులు.. వారి సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

## - గ్రామ సంఘ సహాయకులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన

## - ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్





**చింతలపూడి:ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ అన్నారు. గురువారం చింతలపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సెర్ప్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామవరపుకోట మండలానికి చెందిన 53 మంది గ్రామ సంఘ సహాయకులకు ఆయన స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలకు సాంకేతికతపై పట్టు ఉండటం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా గ్రామ సంఘ సహాయకులు తమ రికార్డులను డిజిటలైజ్ చేయడంతో పాటు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత వేగంగా, పారదర్శకంగా తీసుకెళ్లడానికి వీలవుతుందని తెలిపారు. మహిళా శక్తిని వెలికితీయడం ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, అందుకే కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మరియు కామవరపుకోట మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, ఏపీఎంలు సీఏలు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో తమకు ఎంతగానో ఉపయోగపడే స్మార్ట్ ఫోన్లు అందజేసినందుకు గ్రామ సంఘ సహాయకులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నాదెండ్ల భాస్కరరావు పార్థివదేహానికి కొయ్యలగూడెం జనసేన నాయకుల నివాళి

**కొయ్యలగూడెం/హైదరాబాద్: ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండల జనసేన నాయకులు ఘన నివాళులర్పించారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తండ్రి అయిన భాస్కరరావు స్వర్గస్తులయ్యారనే వార్త తెలుసుకున్న నాయకులు గురువారం ఉదయం హైదరాబాద్‌లోని వారి నివాసానికి చేరుకున్నారు.కొయ్యలగూడెం మండల జనసేన అధ్యక్షులు తోట రవి, జిల్లా జనసేన జోనల్ కమిటీ సభ్యులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మరియు మండల ఉపాధ్యక్షులు అల్లం సత్తిరాజు గారు భాస్కరరావు గారి భౌతికకాయాన్ని దర్శించుకుని, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో భాస్కరరావు చెరగని ముద్ర వేశారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు.అనంతరం, పితృ వియోగంతో బాధపడుతున్న గౌరవ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ ని కలిసి వారు పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈ కష్టకాలంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ మీ కుటుంబానికి అండగా ఉంటారని వారు భరోసా ఇచ్చారు.



# గోపి కుటుంబ సభ్యులను పరామర్శించిన వడ్డీ రఘురాం

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన రాపాక గోపి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న తాడేపల్లిగూడెం వైస్సార్సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా వారి కుటుంబ సభ్యులకి అండగా ఉంటుందని భరోషానిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కవులూరి వెంకన్న, నారాయణ, గోపిశెట్టి దొరబాబు, రాపాక భాను, తమ్మిశెట్టి రఘు, తమ్మిశెట్టి చుక్కయ్య, చిట్టూరి బాపన్న, దారపు రెడ్డి శ్రీనివాస్, మకరాజు సతీష్, రావి వీర రాఘవ, మార్లపూడి సుబ్బారావు, కండెల్లి రాజేష్, ద్వారంపూడి కిరణ్ రెడ్డి, కునుకు పుల్లయ్య, ములపర్తి అఖిల్, అడ్డాల గోపి తదితరులు పాల్గొన్నారు.



# వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించాలి

## - జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

## - జాతీయ రహదారిపై

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం మండలంలోని పెదతాడేపల్లి నుంచి పెంటపాడు మండలం అలంపురం వరకు జాతీయ రహదారిని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం తనిఖీ చేశారు.జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన బ్లాక్ స్పాట్లను ఎస్పీ పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు పోలీస్ అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించే దిశగా బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జంక్షన్ వంటి ప్రాంతాల్లో వాహనదారులు రోడ్డు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డి. విశ్వనాథ్, తహశీల్దార్ ఎం సునీల్ కుమార్, సీఐలు ఆది ప్రసాద్, రవికుమార్, ఎస్సైలు రవికుమార్, స్వామి మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ సురేందర్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# రోడ్డుకు అడ్డంగా కందకం

## – ఆందోళనలో రైతులు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 84 లో జబ్బకుంట కట్టకు వెళ్లే రైతుల బండ్ల బాటకు అడ్డంగా రాజకీయ పలుకుబడి ఉన్న ఓ నాయకుడు కందకం తవ్వాడు. దీంతో ఆ దారి నుండి నిత్యం వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పూర్వం నుండి చిన్న వెంకట నరసయ్య బండ పక్కన నుండి జబ్బకుంట కట్టకు వెళ్లేందుకు దారి ఉంది. ఈ దారి చివర సదరు వ్యక్తి ఓ వెంచర్ ను ఏర్పాటు చేశాడని, ఈ బాటను కూడా కబ్జా చేసుకునేందుకు కందకం తీసినట్లు బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఈ రాజకీయ నాయకుడు ఇదే ప్రాంతంలో బాటకు అడ్డంగా కందకం తవ్వగా ఈ ప్రాంత రైతులు ప్రభుత్వ అధికారులకు పిర్యాదు చేయగా, అప్పటి అధికారులు వచ్చి సదరు రాజకీయ నాయకున్ని మందలించి కందకాన్ని పూడ్చి రైతులకు సమస్య లేకుండా చేశారు. మళ్ళీ ఇప్పుడు ఆ రాజకీయ నాయకుడే కందకం తీసి రైతులకు ఇబ్బంది పెడుతున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి రహదారిని కాపాడాలని రైతులు కోరుతున్నారు.



# వార్డు అభివృద్ధికి కృషి చేస్తా.. కౌన్సిలర్ ఎరుకల భీమన్న.

దేవరకద్ర : ఏప్రిల్ 23, (ప్రజా విక్షణం)

దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండో వార్డు అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని రెండో వార్డు కౌన్సిలర్ ఎరుకల భీమన్న తెలిపారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలోని రెండో వార్డులో ఉన్న వాటర్ ట్యాంక్ దగ్గర డ్రైనేజీ లేకపోవడంతో వాటర్ ట్యాంక్ నుంచి డ్రైనేజీని ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. వాటర్ ట్యాంక్ దగ్గర నీటిని నిలవకుండా లేకుండా డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.రెండో వార్డులో ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకొస్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. వార్డు అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తానని ఆయన తెలిపారు.



# విబి గ్రామ్ జీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేక చట్టమే

- పాత చట్టాన్నే కొనసాగించాలి!.
- కూలీల హక్కులను కాలరాస్తున్న కేంద్ర సర్కారు!.
- నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ను రద్దు చేయాలి!.
- చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు!.

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

కేంద్రం తీసుకువస్తున్న విబి గ్రామ్ జీ బిల్లు 2025 భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన చట్టమేనని, కేంద్రంలో బిజెపి అధికారం లోకి వచ్చిన నాటినుండి ఉపాధి చట్టాన్ని అడుగడున ఉల్లంఘిస్తూ కూలీల హక్కులను కాలరాస్తుందని, పాత పద్ధతిలో ఉపాధి హామీ పనిని కొనసాగించాలని,
విబి గ్రామ్ జీ చట్టాన్ని కూలీలు సంఘటితమై తిరస్కరించాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూలీల పక్షాన నిలబడి విబి గ్రామ్ జీ బిల్లుకు నిరసనగా కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా రద్దు చేయాలని
దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
గురువారం హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామం లోని పాత చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీలతో పనివద్ద సమావేశం ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ కూలీలకు గత మూడు నెలలుగా పనిచేస్తున్న నేటికి వేతనాలు రాలేదని కూలీలు వాపోయరన్నారు. ఎండలు మండుతున్నందున పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవారాజన్ 14 వ పైనాన్స్ కమీషన్ సంబంధించి కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, ఓ ఆర్ ఎస్, ప్యాకెట్స్, మజ్జిగ, మంచినీరు అందించాలని గ్రామ పంచాయతి




సర్పంచ్, కార్యదర్శులకు సర్క్యులర్ జారి చేశారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనని అన్నారు. బిజెపి సర్కారు కూలీల గొంతు నొక్కేందుకే కొత్త కొత్త విధానాలను తీసుకువస్తుందని, విబి గ్రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి కూలీల హక్కులను కాపాడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూలీలు పాత పద్ధతిలో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటునే,
కొత్తగా తెచ్చిన విబి గ్రామ్ జీ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

- హసన్ పర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుధాకృష్ణ
- ఇంటర్ లో 100శాతం ఉత్తీర్ణతపై హర్షం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)

విద్యార్థులు వేసవి కాలాన్ని వృధా చేసుకోకుండా మైండ్ స్పార్క్ అనే యాప్ ని డౌన్లోడ్ చేసుకుని ప్రతిరోజు గంట పాటు ప్రాక్టీస్ చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల హసన్ పర్తి ప్రిన్సిపల్ సుధాకృష్ణ అన్నారు. గురువారం హసన్ పర్తి గురుకుల పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకృష్ణ 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్, పెన్నులు అందించి సత్కరించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ లో 100 శాతం ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆర్ జె సి సెట్ కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి సాధించడం వల్లే వారు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




# ఓటు వేయడం బాధ్యతగా గుర్తించండి

- తమిళనాడు, బెంగాల్ ఓటర్లకు మోడీ పిలుపు

న్యూఢిల్లీ,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)

తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ సందర్భంగా.. ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ దృష్ట్యా, ఓటర్లు ఉత్సాహంగా తరలిరావాలని ఆయన కోరారు. ఓటు వేయడాన్ని కేవలం ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, దేశం పట్ల ఒక పవిత్ర కర్తవ్యంగా భావించాలని ప్రధాని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, కాబట్టి ఏ ఒక్కరూ ఓటింగ్‌కు దూరం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల్లో యువత, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మోదీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మొదటిసారి ఓటు వేస్తున్న యువత నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ..

మంచిర్యాల జిల్లా ఏప్రిల్ 23(ప్రజా వీక్షణం న్యూస్)



మంచిర్యాల జిల్లా వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నేపల్లి మండల తహసిల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాలలో నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న లతో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వా నబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వారు వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS

24 శుక్రవారం, ఏప్రిల్ 2026 | 5 | www.prajaveekshanam.in


## వరంగల్ ఎంపీని కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

హనుమకొండ లోని కనకదుర్గ కాలనీలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యని బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు చకిలం ఉపేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సమస్యలు, కోర్టు సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు న్యాయ సేవలను మరింత మెరుగు పరచాల్సిన అవసరం వంటి అంశాలపై చర్చించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. న్యాయవాదుల సంక్షేమం, కోర్టుల మౌలిక వసతుల పెంపు కోసం తన వంతు కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చకిలం ఉపేందర్‌తో పాటు సభ్యులను ఎంపీ అభినందించారు. వారు న్యాయవాదుల హక్కుల పరిరక్షణలో ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించడంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు లలిత కుమారి, సాంబశివరాజు తదితర కీలక సభ్యులు, న్యాయ వాదులు పాల్గొన్నారు.



## అంగన్వాడీల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ తహసీల్దార్ కు వినతి పత్రం

**బాపట్ల : ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం) :**

అంగన్వాడీల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గురువారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తహసీల్దార్ ఎస్.కె.సలీమాకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాపట్ల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శైలజ శ్రీ మాట్లాడుతూ...2019 నుండి ఇప్పటివరకు అంగన్వాడీలకు ఒక్క రూపాయి జీతం కూడా పెంచలేదని,కనీసవేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు.గత ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసిన సమయంలో నేటి కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వచ్చిన వెంటనే జీతాలు పెంచుతామని,అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు తమ సమస్యలు పరిష్కారించలేదని,జీతాలు పెంచలేదని అన్నారు.నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని,సరుకులు కొనలేని పరిస్థితుల నేపథ్యంలో జీతాలు పెంచకపోతే,తమ కుటుంబాలు నడవడం కష్టసాధ్యమవుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెల నుండి ఎండలు పెరుగుతాయని,40 నుండి 47 డిగ్రీల వేడి ఉష్ణోగ్రత ఉంటుందని ప్రకటించి ఉదయం 10 గంటలు దాటిన తర్వాత ఎవరూ కూడా బయటకు రావద్దని ఒకవైపు హెచ్చరికలు చేస్తూనే ఎండలు మండిపోతున్నా మే నెలలో కూడా పసి పిల్లలను అంగన్వాడీ సెంటర్లకు తీసుకువచ్చి సెంటర్లు నడపాలని ప్రభుత్వం చెప్పడం హేయమైన చర్య అన్నారు.ఇంటి నుండి బయటకు రాలేనంతగా ఎండలు మండిపోతున్నాయని,మే నెల మొత్తం అంగన్వాడీ సెంటర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.పెండింగ్ లో ఉన్న మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు.అంగన్వాడీ హెల్పర్ ప్రమోషన్ జీ.ఓ.5 ని సవరించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకులు కె.శరత్,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల ప్రాజెక్ట్ నాయకులు హేమమాలిని,సీతామహాలక్ష్మి,పద్మ,అశ్విని,రాహేలు తదితరులు పాల్గొన్నారు.



## హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం








**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజపాయి ఆదేశాల మేరకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండు టెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురు వారం రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు యన్. రవి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ యన్. రవి మాట్లాడుతూ, "మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. నా పరిమితుల్లో నేనున్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలక వర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ,"పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం" అని తెలిపారు. అదనపు కలెక్టర్ యన్. రవిని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్డ్ అందచేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు: పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు సాఫీగా సాగాలి

### - ప్రభుత్వ స్థలాలకు మట్టి తరలింపులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి
### - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేసి, మట్టి తరలింపు ప్రక్రియను సాఫీగా నిర్వహిస్తూ మే 15 నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రకాళి చెరువు పూడిక మట్టి తరలింపు పై సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు నుండి మట్టి డంపింగ్ ప్రాంతాల వరకు వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు పరిస్థితులు తదితర అంశాలపై సాగునీటి పారుదల, పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, కుడా అధికారులతో కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడిక మట్టిని రెడ్డిపురం, పలివేల్పుల, మామునూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేయాలని సూచించారు. మట్టి తరలింపులో ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇటుక బట్టీల యజమానుల నుండి మట్టి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని, గతంలో అనుసరించిన విధానానికి అనుగుణంగా అవసరమైన మట్టికి డీడీలు చెల్లించి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

భద్రకాళి చెరువు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెగ్యులేటరీ పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని, పూడిక మట్టి తరలింపు ప్రక్రియలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయం తో పని చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొని సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై.వి. గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటి పారుదల సీఈ సుధీర్, ఎస్ఈ రాంప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్న, సాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డీఈఈ మధుసూదన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

### - అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు
### - వాహనాలు ఢీకొనడంతో మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం

**లక్నో,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## తొలిదశ ఎన్నికల వేళ

### - పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి

**కోల్‌కతా,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతంలోగల ఒక పోలింగ్ బూత్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాలపాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

# గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు.

గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భధారణ ప్రారంభం నుండి పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి ఆరోగ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కాలంలో గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలను నివారించ వచ్చని తెలిపారు. సరైన ఆహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు చిన్న వయస్సులోనే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం అభినంద నీయమని కలెక్టర్ అన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించగా, గర్భిణీలకు సీమంతం నిర్వహించి అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ సునీత, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మహేందర్ కుమార్, డీపీఎం డాక్టర్ భాను ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డెమో అశోక్ రెడ్డి, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, గర్భిణీలు, చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

# పోలీస్ కుటుంబాలకు అండగా ప్రభుత్వం కారుణ్య నియామకం కింద ఐదుగురు జూనియర్ అసిస్టెంట్ లుగా

## నియామక పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఏప్రిల్ 23(ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖలో విధి నిర్వహణలో ఉండగా మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన ఐదుగురు అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాలను ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పోలీస్ కుటుంబాలను ఆదుకోవడమే కారుణ్య నియామకాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. కొత్తగా విధుల్లో చేరుతున్న అభ్యర్థులు క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తమ కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో మరణించిన కానిస్టేబుళ్లు మరియు హెడ్ కానిస్టేబుళ్ల వారసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ పత్రాలు అందుకున్న అభ్యర్థులు, తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ క్లిష్ట సమయంలో ఉపాధి కల్పించినందుకు ప్రభుత్వం మరియు జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థుల వివరాలు:

1. జాదవ్ రాజ్ కుమార్ (తండ్రి: ఉక్క నాయక్)
2. కే వినోద్ కుమార్ (తండ్రి: జలపతిరావు)
3. రాథోడ్ మమత (తండ్రి: శంకర్)
4. ముదాసిర్ అహ్మద్ (తండ్రి: మక్సుద్ అహ్మద్)
5. నాగార్జున (తండ్రి: తిరుపతయ్య)



ఈ కార్యక్రమంలో ఏ.సూపరింటెండెంట్ ఖలిముద్దీన్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మున్నం విజయ శంకర్ రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ సాధనలో ఆర్టీసి కార్మికులే కీలకం

## - అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి వారికుంది- రాణీగంజ్ డిపోముందు సంఘీభావం పలికిన తలసాని

**హైదరాబాద్,ఏప్రిల్ 23(ప్రజా వీక్షణం)**



ఆర్టీసీ సమ్మెలో భాగంగా రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ధర్నాకు దిగారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. ఆర్టీసీకి ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని చెప్పుకొచ్చారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.

# శ్రీ శ్రీ శ్రీ భగీరథ జయంతి ఉత్సవాలు...

**దేవరకద్ర : ఏప్రిల్ 23 (ప్రజా విక్షణం)**

మన కులదైవం భగీరథ మహర్షి జయంతి మహోత్సవం దేవరకద్ర నియోజకవర్గంలో కౌకుంట్ల మండల పరిధిలోని పేరూరు గ్రామంలో సగర సంగం కార్యాలయము నందు గురువారం ఉదయం 8 గంటలకు శ్రీ శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించడమైనది. ఇట్టి కార్యక్రమంలో పేరూరు సగర సంఘం అధ్యక్ష కార్యదర్శులు, చిలుక ఆంజనేయులు, ఆర్ బి సత్యనారాయణ, గార్ల ఆధ్వర్యంలో నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సగర సంగం ఉపాధ్యక్షులు ఆర్. సి. శ్రీనివాస్ సాగర్, మరియు కౌకుంట్ల మండల సాగర సంగం అధ్యక్షులు ఆర్. బి. శ్రీనివాసులు, పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో సగర కుల పెద్దలు, ఎం. రామచంద్రయ్య, ఎం. కృష్ణయ్య, నాగరాల ఆంజనేయులు, గౌని వెంకటయ్య, గౌని కృష్ణయ్య, గౌని రవి సాగర్, బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని సత్యనారాయణ సాగర్, మరియు సగర యువకులు, సగర బంధువులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. తదనంతరం కౌకుంట్ల మండల కేంద్రంలో సగరసంగ కార్యాలయము నందు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల సగర సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆర్. బి. శ్రీనివాసులు,డి. రాజు, భగీరథ మహర్షి ఫోటోకు పూలమాలలు వేసి, వేడుకలను ప్రారంభించడం అయినది. ఈ కార్యక్రమంలో జిల్లా సగర సంఘం ఉపాధ్యక్షులు ,, ఆర్. సి. శ్రీనివాస్ సాగర్, మరియు పేరూరు సాగర సంగం నాయకులు చిలుక పెద్ద ఆంజనేయులు, చిలుక ఆంజనేయులు, గౌని రవి సాగర్, గౌని వెంకటయ్య, గౌని సత్యనారాయణ సాగర్, చిలుక సదువు ఆంజనేయులు, కౌకుంట్ల మండల సగర సంగం నాయకులు, గోపాల్,రాకేష్, రవి, శ్రీను, నర్సింహా, పుల్లన్న, నాగన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సగర సంగ ఉపాధ్యక్షుడు ఆర్. సి. శ్రీనివాస్ సాగర్, మాట్లాడుతూ మన సగరజాతి ఐక్యత కోసం పాటుపడాలని, మన జాతి గౌరవం, మన ఐక్యత చాటే పవిత్రమైన రోజు ఇది. భగీరథుని త్యాగం, గంగమ్మను భువికి తెచ్చిన ఘనత మన రక్తంలో ఉంది. ఆ మహనీయుని జయంతిని అందరం కలిసి ఘనంగా జరుపుకుందాం అని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రం పద్మావతి కాలనీలో భగీరథ జయంతిఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.





# రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం

## - వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగబాయ్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల మంగభాయ్ తెలిపారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ 3వ సర్వసభ్య సమావేశాన్ని మండలంలోని పడాల మార్కెట్ యార్డులో ఆమె అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగబాయ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సహకారం, సూచనలతో మార్కెట్ యార్డ్ ఆదాయాన్ని రెట్టింపు చేశామని తెలిపారు. 2024 -2025 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ యార్డ్ ఆదాయం రూ 6 కోట్లు కాగా, దానిని 2025-2026 సంవత్సరానికి రూ 12 కోట్లుకు పెరిగేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక ఆదాయాన్ని పొందే మార్కెట్ యార్డుల్లో తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డు మూడో స్థానంలో నిలవటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, డైరెక్టర్లు కొవ్వూరి లక్ష్మణ రెడ్డి, నాయకులు చాపల రమేష్, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..





# గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనీయుడు భగీరథుడు

- జనసేన నాయకులు పైబోయిన వెంకట రామయ్య

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహనీయుడు అపర భగీరథుడని, ఆయన చలువ వల్లే జీవకోటి మనుగడ సాధ్యమవుతుందని జనసేన నాయకులు పైబోయిన వెంకటరామయ్య ( ల్యాండ్ లార్డ్ ) తెలిపారు. సగర సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపాలెంలో గురువారం భగీరథుడు జయంతిని పురస్కరించుకుని పైబోయిన వెంకట రామయ్య భగీరథుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా భగీరథ మహర్షి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పైబోయిన వెంకట రామయ్య మాట్లాడుతూ భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం ప్రతి ఒక్కరికి ఆదర్శమని కొనియాడారు. కఠోర తపస్సు ద్వారా అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమిపైకి తీసుకొచ్చిన మహనీయుడుగా భగీరథ మహర్షి చరిత్రలో నిలిచిపోయారని, ఆయన మానవజాతికి ఆదర్శప్రాయుడని వివరించారు. అనంతరం మోదుగుంటలో సగర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వెంకట రామయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం సొసైటీ అధ్యక్షుడు సిద్ధబత్తుల వీరన్న, మాజీ సర్పంచ్ కే జానకి రామయ్య, సగర సంఘం నాయకులు కోటేశ్వరరావు, కొండరాజు తదితరులు పాల్గొన్నారు.





# "డిమాండ్లు తీర్చండి లేకుంటే ప్రాణాలు అర్పిస్తాం"

- ఆర్టీసీ డ్రైవర్ ఆత్మాహుతి యత్నం రాష్ట్రాన్ని కుదిపింది
-తదుపరి కార్యాచరణ ప్రకటించానున్న కార్మిక సంఘాలు
- భగ్గుమన్న ఉద్యమాల ఖిల్లా వరంగల్ జిల్లా
-ఉద్యమం నీరుగారుతున్నదని మనస్తాపం
- పలు రూట్లకు బస్సులు నడపటంతో తీవ్ర ఉద్రిక్తత



**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**



తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు మళ్లీ భగ్గుమంటున్న వేళ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికుల ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్తతను సృష్టిస్తోంది. గత రెండు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ కార్మికులు సమ్మెకు దిగగా, ప్రభుత్వం స్పందించక పోవడం పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ నేపథ్యంలో వరంగల్ జిల్లాలోని నర్సంపేట డిపోలో చోటు చేసుకున్న సంఘటన అందరినీ కలచివేసింది. ఆ డిపోకు చెందిన ఓ ఆర్టీసీ డ్రైవర్ బోలే శంకర్ గౌడ్ తీవ్ర ఆవేదనతో పెట్రోల్ పోసుకొని తనపై తాను నిప్పంటించు కోవడం రాష్ట్రాన్ని షాక్‌కు గురిచేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ ఆత్మాహుతి యత్నం చేసినట్లు సమాచారం. సాక్షుల కథనం ప్రకారం.. డిమాండ్ల పరిష్కారం కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన రాకపోవడంతో డ్రైవర్ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనయ్యాడని తెలుస్తోంది. ప్రైవేట్ డ్రైవర్ల తో పోలీసులు ముందుండి బస్సులు నడుపుతూ సమ్మె ఉధ్రుతి తగ్గిస్తూ ఉండటంతో మనస్తాపంతో ఆత్మహుతికి పాల్పడినట్టు తోటి ఉద్యోగులు వాపోతున్నారు. కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి అతడిని ఈ దారుణ నిర్ణయానికి నెట్టినట్లు సహచరులు తెలిపారు. ఘటనతో ఒక్కసారిగా నర్సంపేట డిపో పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. సహచరులు వెంటనే స్పందించి మంటలను ఆర్పి, తీవ్ర గాయాలతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్రంగా స్పందించాయి. ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయ వర్గాలు కూడా స్పందిస్తూ బాధిత కుటుంబానికి సహాయం అందించాలని కోరుతున్నాయి. ఈ సంఘటన తెలంగాణలో కార్మికుల సమస్యలు ఎంత తీవ్రమైపోయాయో మరోసారి చూపించింది. చర్చల ద్వారా పరిష్కారం లేకపోతే ఇలాంటి ఘటనలు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# బిఆర్ఎస్ పార్టీ 53 వ డివిజన్ ఇంచార్జీగా బోడ యుగంధర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

**ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్):**



గ్రేటర్ వరంగల్ బిఆర్ఎస్ పార్టీ 53 వ డివిజన్ ఇంచార్జీ గా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు బోడా యుగంధర్ ను నియమించారు. ఈ సందర్భంగా బోడ యుగంధర్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత, అవకాశం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ కి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ కి 66 వ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్ కు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

# అనంతలో హనీట్రాప్ ముఠా ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**అనంతపురం,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

అనంతపురంలో గత కొంతకాలంగా ప్రముఖులే లక్ష్యంగా సాగుతున్న హనీట్రాప్ ముఠా వ్యవహారం బట్టబయలైంది. హనీ ట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కింగ్ రంగమ్మ నాయుడు అలియాస్ చిన్ని నాయుడమ్మతో పాటూ దబ్బర రాజేష్, జయలక్ష్మి, మల్లేశ్వరి, అనంత కుమారిని అరెస్ట్ చేశారు. ఉదయ్ భాస్కర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ముఠా ఇప్పటివరకు పలువురిని హనీ ట్రాప్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 'మల్లేశ్వరి, రంగమ్మ నాయుడు పథకం ప్రకారం అమాయకులను, బాగా డబ్బున్నవాళ్లకు వల వేసి ట్రాప్ చేసేవారు.

# జిల్లా అభివృద్ధి నిర్మాణ పనులలో అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలి


- ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చి దిద్దాలన్నదే ప్రభుత్వం లక్ష్యం.
- జిల్లాలో గంజాయి, సారా, బెల్ట్ షాప్స్ అరికట్టేవిధంగా చర్యలు చేపట్టాలి.
- వేసవిదృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకూడదు.
- చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి.
- సమావేశాలకు హాజరుకాని అధికారులుపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సిఈవో కి జెడ్పీ చైర్ పర్సన్ ఆదేశాలు జారీ.
- ఉభయ జిల్లాలు జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ .



**ఏలూరు ఏప్రిల్ 23 ( ప్రజా వీక్షణం )**

ఉభయ జిల్లాలో అభివృద్ధిలో కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం స్థాయీ సంఘ సమావేశాలను జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ, ఉభయ జిల్లాలు అధికారులు, జిల్లా పరిషత్తు సభ్యులతో కలసి చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ 1 వ, 7 వ స్థాయి సంఘాలు సమస్యలు, రెండవ విడతగా 2,3,4,5,6 స్థాయి సంఘాలు సమస్యలుపై సమీక్షంచారు. మొదటిగా వివిధ శాఖల అధికారులు జిల్లాలో మండలాలు వారీగా మంజూరైన పనులు, ప్రగతిలో పనులు వాటి వివరాలు, ఇంకా జరగవలసి ఉన్న పనులు వివరాలను తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్తు చైర్పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పదంలో నడిపించుటకు అందరు సహకారంతో ముందుకు సాగుతున్నామని, అధికారలు పాత్ర కీలకమైనదన్నారు. జిల్లాలో మంజూరైన కొన్ని పనులు పూర్తిచేయని కారణంగా ఇంకా కొన్ని పనులు పెండింగ్లో ఉన్నాయని, వాటిని నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పౌరసరఫరాలు ద్వారా అమలు చేస్తున్న రేషన్ పంపిణీ, రైసు కార్డ్స్, ధాన్యం కొనుగోలు వంటి అంశాలుపై సమీక్షించారు. ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామంగా తీర్చి దిద్దాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని ఆ దిశగా శానిటేషన్, మురుగునీరు పారుదల అయ్యేలా డ్రైనేజిలను శుభ్రం చేయడం, త్రాగునీటి సమస్యలను పక్కాగా పరిష్కరించాలన్నారు. ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తూ జిల్లా పరిషత్ పరిధిలో గల ఉభయ గోదావరి జిల్లాలో గంజాయి, సారా, బెల్ట్ షాప్స్ అరికట్టేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ క్రింద జిల్లా పరిషత్తు ద్వారా చేపట్టిన రహదారులు అభివృద్ధిలో భాగంగా 2024-25 సంవత్సరంలో 1576 పనులకు గాను 1419 పనులు పూర్తి చేసి 202 కిలోమీటర్లు పూర్తి చేయడం జరిగింది. 2025-26 లో 1360 పనులకు గాను 561 పనులు పూర్తి చేసి 209 కిలోమీటర్ల రహదారులు పూర్తి చేయడం జరిగిందని పంచాయతీరాజ్ అధికారి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కు వివరించారు. డిఆర్డిఏ ద్వారా ఎన్టీఆర్ పెన్షన్స్ భరోసా, ఎస్ హెచ్ జి గ్రూపులకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి వంటి అంశాలుపై సమీక్షించారు. ఉమ్మడి జిల్లాలో డ్వామా ద్వారా చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్, జలహారతి పై సమీక్షించారు. వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రతి గ్రామంలో చెరువులు నింపడం, బోర్లు రిపేర్లు చేయటం వంటి ప్రక్రియను



వేగవంతం చేసి పక్కా ప్రణాళికతో త్రాగు నీటిని గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్డబ్ల్యూఎస్ పంచాయితీ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖపై సమీక్షిస్తూ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాల్లో పూర్తి చెయ్యాలని అన్నారు. అదే విధంగా ఇళ్లస్థలాలు కొరకు కొత్తగా దరఖాస్తు చేసిన వారి దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్మిక శాఖ ద్వారా అమలు చేస్తున్న వివాహ కానుక పథకం, ప్రసూతి ప్రయోజనా పథకం, సహజ మరణ ఉపశమన పథకం, అంత్యక్రియలు సహాయ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రయోజనాలను అసిస్టెంటు లేబరు కమీషనరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కు వివరించారు. పరిశ్రమలు శాఖ ద్వారా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని, ఆ దిశగా వారికి బ్యాంకులు రుణ సౌకర్యంతో పాటు 45 శాతం రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందని పరిశ్రమలు శాఖ అధికారి వివరించారు. వ్యవసాయ, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం శాఖలు ద్వారా అమలు చేస్తూ లబ్ధిదారులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు లక్ష్యసాధన వివరాలను జడ్పీ వైస్ చైర్పర్సన్ పోసిన శ్రీలేఖ, మొడియం రామ తులసి, పెనుముల విజయబాబులు స్థాయి సంఘాలు సమావేశంలో పథకాలు పురోగతిపై సమీక్షిస్తూ పెండింగులో ఉన్న పనులను వేగవంతం చెయ్యాలని అధికారులకు సూచించారు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిషత్తు చైర్పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్తు సిఇవో పి.జగదాంబ, ఉభయ జిల్లాలు వివిధ శాఖలు అధికారులు, జిల్లా పరిషత్తు సభ్యులు, జిల్లా పరిషత్తు అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుండి ధాన్యం వస్తోంది, టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది, ధాన్యం నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు అను అంశాలను కలెక్టర్ అధికారులు, నిర్వాహకుల ను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్ లో నమోదు చేసి, చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటు లో ఉండాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత కార్య కలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించి, అక్కడి కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన పొందారు. సహకార సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తి కరంగా ఉన్నాయని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ములుకనూరు సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీసీఎస్‌వో వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ సౌజన్యంతో జర్నలిస్టులకు హెల్మెట్ లు

## - బాపట్లలో జర్నలిస్టుల హెల్మెట్ అవగాహన ర్యాలీ





**బాపట్ల : ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం) :**

జర్నలిస్టుల సంక్షేమం,రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీకి అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ ఆకర్షణగా నిలిచారు.ఆయన సౌజన్యంతో ప్రెస్ క్లబ్ సభ్యత్వం కలిగిన 181 మంది జర్నలిస్టులకు హెల్మెట్లను పంపిణీ చేశారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్.వాసుదేవ వినోద్ కుమార్,బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ముఖ్య అతిథులుగా హాజరై హెల్మెట్లను అందజేశారు.అనంతరం కలెక్టరేట్ కార్యాలయం నుంచి జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ హెల్మెట్ అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్,శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు,అధికారులు విన్నకోట సురేష్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.జర్నలిస్టుల భద్రతపై ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.....హెల్మెట్ వినియోగం ప్రాణ రక్షణకు అత్యవసరమని స్పష్టం చేశారు.సమాజానికి మార్గనిర్దేశం చేసే జర్నలిస్టులు ముందుండి హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు.బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.....బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని,ముఖ్యంగా జర్నలిస్టుల కోసం హెల్మెట్లను అందించిన విన్నకోట సురేష్ ఉదారత ప్రశంసనీయమని అన్నారు.బాపట్ల డీఎస్పీ చంద్రమౌళి మాట్లాడుతూ.....రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో హెల్మెట్ వినియోగం కీలకమని తెలిపారు.జిల్లా రవాణా శాఖ అధికారి టీ.కె.పరంధామరెడ్డి మాట్లాడుతూ.....వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.....సభ్యుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్ మాట్లాడుతూ.....ఈ హెల్మెట్ల పంపిణీ కార్యక్రమానికి సహకరించిన అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు డి.బి.రంగారావు,ప్రసన్న కుమారి, పట్టణ సీఐ ఆర్.రాంబాబు,మహిళా ఎస్ఐ ఎస్.కె.నస్రీన్,జిల్లా సమాచార అధికారి వెంకట రమణ,టీడీపీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు,ప్రెస్ క్లబ్ కోశాధికారి బుర్ర ఆంజనేయులు,సమాచార కార్యదర్శి బండ్రెడ్డి గోపి,బాపట్ల,రేపల్లె,వేమూరు,చీరాల,పర్చూరు ప్రాంతాల ప్రెస్ క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనంతబాబు కోవర్టుగా పోలీస్

## - సిఐ రవికుమార్‌ను బదిలీ చేసిన ఏలూరు ఐజి

**కాకినాడ,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుశాఖ రహస్య సమాచారం అందిస్తున్నారనే ఆరోపణలపై కాకినాడ జిల్లా సర్పవరం పీఎస్ ఇన్‌ఛార్జి సీఐ రవికుమార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఆయన్ను విధుల నుంచి తప్పించి.. వీఆర్‌కు పంపిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ ఆదేశాలు జారీ చేశారు. దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. పోలీసుల దర్యాప్తునకు సంబంధించిన సమాచారం లీక్ చేశారని సీఐపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకున్నారు.మరోవైపు.. ఎమ్మెల్సీ అనంతబాబును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఇంద్రపాలెం అంబేద్కర్ జంక్షన్ వద్ద కూటమి నేతలు ఆందోళన చేపట్టారు. కాకినాడ రూరల్ తెదేపా, జనసేన నేతలు రాస్తారోకో నిర్వహించారు.

# నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్ సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఆర్టీసీ డిపో డ్రైవర్ నర్సంపేట బస్టాండ్ లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థలాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులు కలసి పరిశీలించారు. ఈ సందర్బంగా సంఘటన జరిగిన తీరును పోలీస్ కమిషనర్ సంబందించిన పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, స్పెషల్ బ్రాంచ్, నర్సంపేట ఏసీపీలు జితేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, సిఐ లు శ్రీనివాస్, సాయి రమణ, దుగ్గొండి ఎస్.ఐ రణధీర్ వున్నారు.



# అర్హులైన జర్నలిస్టులకి అక్రిడిటేషన్ కార్డులు

## - జిల్లా కలెక్టర్ సత్య శారద

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో గురువారం నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని 252 జీవో ననుసరించి అర్హులైన జర్నలిస్ట్ కి అక్రిడిటేషన్ లు అందజేస్తామని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం ఆన్లైన్ ద్వారా ఐపిఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను జీవో ననుసరించి క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రయత్నించాలని ఆమె సూచించారు. ప్రజాస్వామ్యం లో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026-2028 సంవత్సరానికి నూతన కార్డులు జారీచేసే పక్రియ ను వేగవంతం చేయాలని వారు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆమె పేర్కొన్నారు ఎవరు ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని జర్నలిస్టులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీరాశీ రాశీచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బోడిగ శ్రీనివాస్, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు పాల్గొన్నారు.



# బాపిరాజుకు అభినందనలు తెలిపిన తెదేపా నాయకులు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన జిల్లా పరిషత్ మాజీ చెఎర్మన్ ముళ్ళపూడి బాపిరాజుని నల్లజర్లలోని వారి నివాసంలో గురువారం పలువురు తెదేపా నాయకులు కలిసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. తాడేపల్లిగూడెం ఎఎంసి వైస్ చైర్మన్ ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, నవాబుపాలెం సొసైటీ డైరెక్టర్ వెలిగట్ల రాము, జగన్నాథపురం మాజీ నీటి సంఘం అధ్యక్షులు బొల్లిన రామకృష్ణ,, టీడీపీ సీనియర్ నాయకులు ముత్యాల పాపారావు, మల్లిపూడి కిషోర్ తదితరులు బాపిరాజుని పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు.



ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
24 శుక్రవారం, ఏప్రిల్ 2026
9
www.prajaveekshanam.in

# కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంలో వడ్డి రఘురామ్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పట్టణంలోని వైసీపీ 23వ వార్డు ఇంచార్జి పట్నాల గణపతి నివాసంలోగురువారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు పాల్గొని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవలసిన కార్యాచరణపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గొర్రెల శ్రీనివాస్, బుడి ప్రసాద్, మానుకొండ వెంకటేశ్వరావు, కాకర్ల శ్రీనివాస్, పాలూరి దొరబాబు , అశోక్ దొర, బండి నరసింహ రావు, వట్టి బుజ్జి, ములపర్తి, కాకర్ల శ్రీను, వీర్ల కుమార్, సత్తిబాబు, కుమార్ స్వామి, జాని, నారాయణ రాంబాబు, అంజిరెడ్డి. అనిల్, రేడ్డి శ్రీను. అఖిల్, కునుకు పుల్లయ్య, వింజమూరి శ్రీనివాస్,రెడ్డి శ్రీనివాస్, గోక వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తి పన్ను వసూలలో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచిన తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

## - ఉన్నతాధికారుల చేతుల మీదగా అవార్డు అందుకున్న కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆస్తి పన్ను వసూలులో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలిచి అవార్డును దక్కించుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించి ఆస్తి పన్ను వసూళ్ళలో తాడేపల్లిగూడెం పురపాలక సంఘం లక్ష్యం రూ. 21.85 కోట్లుకాగా వసూలులో మొత్తం రూ. 14.83 కోట్లు (67.86 %) సేకరించటంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో 2వ ర్యాంక్ ని చేజిక్కించుకుంది. విజయవాడలో గురువారం నిర్వహించిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాల మున్సిపల్ కమీషనర్ ల సమీక్ష సమావేశంలో ఎం.ఏఎయూ.డి డిపార్ట్మెంట్ గౌరవ ప్రిన్సిపల్ సెక్రెటరీ యస్. సురేష్ కుమార్ మరియు గౌరవ కమీషనరు అండ్ సంచాలకులు, పురపరిపాలన శాఖ పి.సంపత్ కుమార్ చేతుల మీదగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనరు ఎం.ఏసుబాబు కి అవార్డుని అందజేయటంతోపాటు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆస్తి పన్ను వసూలులో రాష్ట్రంలో రెండవ ర్యాంక్ సాధించి ఉన్నతాధికారుల చేతులమీదుగా తాను అవార్డ్ అందుకోవటం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆస్తి పన్ను వసూలులో పురపాలక సంఘ



అధికారులు , సిబ్బంది చేస్తున్న కృషితో పాటు పట్టణ ప్రజల సహకారం వల్లనే ఈ అవార్డు సాధించగలిగామని కమిషనర్ ఏసుబాబు వివరించారు. అవార్డు సాధించిన ఏసుబాబుకు పురపాలక సంఘ అధికారులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# నాదెండ్ల భాస్కరరావు పార్థీవ దేహానికి నివాళులర్పించిన

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

జనసేన పార్టీ పి.ఏ.సి చైర్మన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రిగారైన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు నాదెండ్ల భాస్కరరావు గురువారం కాలం చేశారు. భాస్కరరావు మరణ వార్త విన్న వెంటనే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హుటాహుటిన హైదరాబాద్ వెళ్లి భాస్కరరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు శాసనసభ్యులు ధర్మరాజు, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న, ఆర్టీసీ రీజినల్ డైరెక్టర్ - జోన్ -2 రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



# రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు.




# తమిళనాడులో పోలింగ్ ప్రారంభం

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
## ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్ తదితరులు
## ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి

**చెన్నై,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**







తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్ముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది. శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

# అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

## - సమ్మెను విచ్ఛిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు

**జనగామ,ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటు ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు.



# ఆళ్లగడ్డ పట్టణంలో దారుణం

## భార్యను గొంతుకోసి భర్త పరార్

**నంద్యాల,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో దారుణం చోటు చేసుకుంది. అనుమానంతో భార్యను భర్త హత్య చేశాడు. కత్తితో గొంతుకోసి పరారయ్యాడు. పట్టణంలోని చాంద్ వీధిలో పుష్ప (26) భర్త, పిల్లలతో కలిసి నివాసం ఉంటోంది. గురువారం ఉదయం.. పిల్లలు బిగ్గరగా ఏడుస్తుండటంతో.. ఇరుగు పొరుగువాళ్లు వెళ్లి చూశారు. రక్తపు మడుగులో ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామని తెలిపారు. హత్యకు గల కారణాలను ఆరా తీస్తున్నారు.

# నగరంలో పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

## - దాడి చేసి ముఠాను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్మతతున్న ముటాను పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడిలాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం.

ప్రజావీక్షణం
దినపత్రిక

# హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ

## - మంత్రి సవిత సంచలన వ్యాఖ్యలు

**అమరావతి,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**


సమాజం కోసం మంచి చేసే నాయకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ తెలుగుదేశం అయితే హంతకుల్ని తయారు చేసే ఫ్యాక్టరీ వైసీపీ అంటూ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. హత్యలు చేయటం, సాక్షుల్ని బెదిరించటం, రేటు మాట్లాడటం, కుటుంబసభ్యులను, జడ్జిలను కూడా బెదిరించాలని చూడటం జగన్‌కు అలవాటు అంటూ మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ తరహాలోనే వైసీపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. తండ్రి శవం పెట్టుకుని రాజకీయం చేయటం, బాబాయ్ గొడ్డలి పోటు ఘటనలను ఇప్పటికే చూశామని మంత్రి తెలిపారు. చంపటం, రౌడీలను, గూండాలను తయారు చేయటమే వైసీపీ పనిగా పెట్టుకుందన్నారు మంత్రి. అనంత బాబును జగన్ నెత్తిన పెట్టుకోవటంతోనే దళితుడైన సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సైకో తనానికి పరాకాష్టగా అనంత బాబు వ్యవహారం ఉందన్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసు నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వం వదలదని స్పష్టం చేశారు. గతంలో ఏమరపాటు ఉండి ఉండొచ్చేమో కానీ ఇప్పుడు ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. జగన్ వల్ల బలయ్యేవారిలో బీసీలు, దళితులే ఎక్కువ మంది ఉన్నారని మంత్రి సవిత పేర్కొన్నారు.




# అర్ధరాత్రి అరాచకం: చర్చి కూల్చివేతపై భగ్గుమన్న బాధితులు!

## - తక్షణమే స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పందించాలి.. న్యాయం చేయాల్సిందే!

## - నోటీసుల సాకుతో జేసీబీలతో విరుచుకపడ్డ అడపా నాగరాజు?








**టీ నర్సాపురం:ఏప్రిల్ 23 (ప్రజా వీక్షణం)**

పవిత్రమైన ప్రార్థనా మందిరంపై అర్ధరాత్రి వేళ జేసీబీలతో జరిగిన దాడి ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలంలో చిచ్చు రేపింది. పాత పెట్రోల్ బంక్ సమీపంలోని లి'ది లెమన్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చి'లిని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తన అనుచరులతో కలిసి ధ్వంసం చేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు మరియు క్రైస్తవ సంఘాలు స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

**ఎమ్మెల్యే గారూ.. మా ఆవేదన వినండి**

కూల్చివేత జరిగిన తీరుపై బాధితులు కన్నీరు మున్నీరవుతూ ఎమ్మెల్యే దృష్టికి పలు అంశాలను తీసుకెళ్తున్నారు:

**అర్ధరాత్రి దొంగదెబ్బ:**

డిసెంబర్‌లో నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమే అయినా, కనీసం ఇంటిమేషన్ ఇవ్వకుండా అర్ధరాత్రి పూట దొంగల్లా వచ్చి కూల్చివేయడం ఏ రకమైన న్యాయం?

నిలువునా ముంచేశారు

లోపల ఉన్న పవిత్ర గ్రంథాలు, ఫర్నిచర్, మైక్ సెట్లు వంటి విలువైన సామాగ్రిని కూడా తీసుకోనివ్వకుండా మట్టిలో కలిపేశారు.

**ఎమ్మెల్యే జోక్యం కావాలి:**

రాజకీయ బలంతో రెచ్చిపోతున్న అడపా నాగరాజుపై ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని, తమకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని నిరసనకారులు గళమెత్తారు.

**రహదారిపై కొవ్వొత్తుల నిరసన ..**

హోరెత్తిన నినాదాలు

అడపా నాగరాజును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. వందలాది మంది చేతుల్లో కొవ్వొత్తులు పట్టుకుని "అడపా నాగరాజు డౌన్" అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రహదారిపై వాహనాలు నిలిచిపోయి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**నిరసనకారుల డిమాండ్లు :**

అడపా నాగరాజుపై కేసు : చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న అడపా నాగరాజును వెంటనే అరెస్టు చేయాలి.

ఎమ్మెల్యే హామీ : ఎమ్మెల్యే స్వయంగా వచ్చి మాకు భరోసా ఇవ్వాలి, చర్చి పునర్నిర్మాణానికి సహకరించాలి.

**కఠిన శిక్ష :**

మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన వారిని విడిచిపెట్టకూడదు. అడపా నాగరాజు అరాచకంపై 'ఫైర్' రాజకీయ అధికారం ఉందన్న అహంకారంతో సామాన్యుల ప్రార్థనా మందిరాలపై జేసీబీలు ఎక్కించడం మీ పిరికితనానికి నిదర్శనం. డిసెంబర్‌లో నోటీసులు ఇస్తే, పగలు వచ్చి చట్టబద్ధంగా వ్యవహరించాలి కానీ, అర్ధరాత్రి పూట రౌడీల మాదిరిగా ప్రవర్తించడంపై ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు. ఈ చర్య పార్టీకి మరియు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ.

**న్యాయం కోసం పోరాటం ఆపబోం!**

పోలీసులు మరియు అధికారుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. "మా ఎమ్మెల్యే స్పందించి, బాధ్యులకు శిక్ష పడేలా చూసే వరకు మా పోరాటం ఆగదు" అని క్రైస్తవ సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రస్తుతం టీ . నర్సాపురంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఎడిటర్ నోట్ :**

ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నేతలు ప్రజలకు రక్షణగా ఉండాలి కానీ, ఇలా భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడటం సరికాదు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఈ విషయంలో తక్షణమే స్పందించి శాంతి భద్రతలను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేలు జరిమాన

## - హంగర్గ గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు

**నిజామాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా పోతంగల్ హంగర్గ గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగు,రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని అన్నారు. దీంతో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్ అమ్మవద్దని, జంక్‌ఫుడ్స్ నిషిద్ధమని తెలిపారు .అనంతరం శివాజీ చౌక్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపి, గ్రామ కార్యదర్శి గంగారాం, భజరంగ్, గోవింద్, ఉమ్మార్,జీవన్ తదితరులు పాల్గొన్నారు.




# హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణ

## - మేఘావృతమై ఉరుములతో చిరుజల్లులు

**హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

హైదరాబాద్ మహానగరంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండలు దంచి కొట్టగా.. ఆ తర్వాత ఉన్నట్టుండి వాతావరణం మేఘావృతం అయ్యింది. ఆకాశం మేఘావృతమై ఉరుములతో పలుచోట్ల చిరుజల్లుల కురిసాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావం నెలకొందని వాతావరణశాఖ వెల్లడించింది. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.

# నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

## - తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం

## - ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

**హైదరాబాద్,ఏప్రిల్23 (ప్రజా వీక్షణం)**

తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.





# 2028 ఒలింపిక్స్‌లో అధికారికంగా క్రికెట్




ప్రపంచంలో రెండో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్ వేదికపై కనిపించి దశాబ్దాలు దాటిపోయింది. చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. సరిగా 128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్ క్రీడల్లో మళ్లీ మెరవబోతోంది. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ 2028 నిర్వాహకులు క్రికెట్ పోటీల కోసం దక్షిణ కాలిఫోర్నియాలోని పామోనాలో ఉన్న ఫెయిర్ గ్రౌండ్స్‌ను వేదికగా ఎంపిక చేశారు. ఈ చారిత్రక మైదానంలో బుధవారం నాడు స్టేడియం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ స్టేడియం సుమారు పదివేల కంటే ఎక్కువ మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యంతో నిర్మించబోతున్నారు. అంతర్జాతీయ ప్రామాణాలతో కూడిన ఈ ప్రీమియర్ క్రికెట్ స్టేడియం పురుషుల, మహిళల పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నిర్మాణ పనుల ప్రారంభాన్ని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఒక మైలురాయిగా అభివర్ణించింది. ఒలింపిక్ చరిత్రలో తొలిసారిగా ఒక క్రీడ మ్యాచ్ సమయాలను భారతీయ ప్రామాణిక సమయానికి అనుగుణంగా రూపొందించడం విశేషం. భారత ఉపఖండంలోని వంద కోట్లకు పైగా ఉన్న క్రికెట్ అభిమానులను ఆకర్షించేందుకు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లాస్ ఏంజిల్స్ స్థానిక కాలమానం ప్రకారం మ్యాచ్‌లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రారంభమవుతాయి. ఇది భారత కాలమాన ప్రకారం వరుసగా రాత్రి 9.30 గంటలకు, ఉదయం 7 గంటలకు అవుతుంది. ఈ సమయాలు భారత టీవీ ప్రేక్షకులకు, డిజిటల్ వీక్షకులకు అత్యంత అనుకూలమైనవి. సాధారణంగా ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతక పోరు ముగిసిన తర్వాతే స్వర్ణ పతక పోరు జరుగుతుంది. కానీ క్రికెట్ విషయంలో ఈ సంప్రదాయాన్ని పక్కన పెట్టి, స్వర్ణ పతక మ్యాచ్‌ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య నిర్వహించాలని నిర్ణయించారు. ఇది భారత్ ప్రైమ్‌కు సరిగా సరిపోతుంది. భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుందని నమ్మకంతోనే వీక్షకుల సంఖ్యను పెంచుకోవడానికి నిర్వాహకులు ఈ మార్పులు చేసినట్టు తెలుస్తోంది. లా28 ఒలింపిక్స్‌లో క్రికెట్ అత్యంత వేగవంతమైన టీ 20 ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. పురుషుల, మహిళల విభాగాల్లో చెరో ఆరు జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటాయి క్రికెట్ ఒలింపిక్స్‌లో చేర్చడం ద్వారా కొత్త దేశాలకు ఈ క్రీడను విస్తరించవచ్చని ఐసీసీ భావిస్తోంది. ఇప్పటికే ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో టీ20 ఫార్మాట్ విజయవంతమైంది. ఐసీసీ ఛైర్మన్ జైషా ఈ పరిణామాలపై సంతోషం వ్యక్తం చేశారు. వేదికల ప్రకటన అనేది ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనానికి పడిన తొలి అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఐఓసీతో కలిసి క్రికెట్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒలింపిక్ ఉద్యమంలో భాగం కావడం వల్ల క్రికెట్‌కు వివిధ దేశాల ప్రభుత్వాల నుంచి మరింత నిధులు , మద్ధతు లభిస్తుందని ఐసీసీ పేర్కొంది. అమెరికా క్రీడా అభిమానులు హోమ్ రన్‌లు, లాంగ్ బాల్స్‌ను ఇష్టపడతారని, క్రికెట్‌లో ఇవి పుష్కలంగా ఉంటాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒలింపిక్స్ ద్వారా అమెరికన్లకు క్రికెట్ పట్ల ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. లా28లో క్రికెట్‌తోపాటు బేస్ బాల్/ సాఫ్ట్ బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్, స్క్వాష్ వంటి క్రీడలు కూడా కొత్తగా చేరాయి. భారత్ , ఉపఖండం కోసం మీడియా హక్కుల విక్రయం విషయంలో నిర్వాహకులు మూడు రకాల ప్యాకేజీలు సిద్ధం చేశారు. మల్టీప్లాట్‌ఫామ్, టీవీ ఓన్లీ, డిజిటల్ ఓన్లీ. దీని ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.


## ధోనీ వల్లే స్టేడియాలు పసుపు మయం

## చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్

దిగ్గజ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ వల్లే తాము ఎక్కడికి వెళ్లినా స్టేడియాలు పసుపు మయం అవుతున్నాయని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. దురదృష్టవశాత్తు ఆయన ఆడటం లేదని, కానీ ఈ క్రేజ్ సృష్టికర్త ధోనీనే అని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో వాంఖడే వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సీఎస్‌కే టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన రుతురాజ్ గైక్వాడ్‌ను ముంబైలో సీఎస్‌కే క్రేజ్ గురించి హోస్ట్ ప్రశ్నించాడు. ధోనీ వల్లే ఈ క్రేజ్ అని గైక్వాడ్ బదులిచ్చాడు. టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకోవాలనుకున్నామని గైక్వాడ్ తెలిపాడు. ‘మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ ఇది 50-50 నిర్ణయమే. పిచ్ బాగుంది. వాంఖడేలో ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా మెరుగైన ప్రదర్శన కనబర్చడం ముఖ్యం. కాబట్టి మొదట బ్యాటింగ్ చేసినా సరే అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడం కీలకం. మేం మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాం. కానీ కీలక సమయాల్లో అవకాశాలను చేజార్చుకుంటున్నాం.గత మ్యాచ్‌లో మా బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. బ్యాటింగ్‌లో కూడా మంచి ఆరంభం లభించింది. కానీ కీలక సమయంలో తడబడి విజయాన్ని చేజార్చుకున్నాం. జట్టులో అందరూ ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. మా దిగ్గజం ధోనీ వల్లే మేం ఎక్కడికి వెళ్లినా అభిమానుల మద్దతు లభిస్తోంది. స్టేడియాలు పసుపుమయం అవుతున్నాయి. దురదృష్టవశాత్తూ ధోనీ ఈ మ్యాచ్ ఆడటం లేదు. కానీ ఇదంతా ఆయన సృష్టించిన ప్రభావమే. ఈ రాత్రి మా అభిమానులను సంతోషపరుస్తామని ఆశిస్తున్నాను. మా జట్టులో రెండు మార్పులు ఉన్నాయి.’అని రుతురాజ్ గైక్వాడ్ తెలిపాడు. మరోవైపు టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. గత మ్యాచ్ తరహాలోనే మెరుగైన ప్రదర్శన చేసి విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆటను ఆస్వాదించాలని మా కుర్రాళ్లకు చెప్పానన్నాడు. కోల్‌కతాతో మ్యాచ్ తరహాలోనే ఈ పిచ్ ఉందని, ఆ మ్యాచ్ తరహాలోనే లక్ష్యాన్ని ఛేదిస్తామని చెప్పాడు.







## లక్నో వరుస ఓటములు

లక్నో వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జియాంట్స్ కీలక మ్యాచ్‌లో తలపడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యాక 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. స్టార్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (22) రాణించగా.. వైభవ్ సూర్యవంశీ (8), ధ్రువ్ జురేల్ (0), కెప్టెన్ రియన్ పరాగ్ (20), షిమ్రాన్ హెట్‌మెయిర్ (22) తక్కువ పరుగులు చేయగా.. రవీంద్ర జడేజా (43), ఫెరిరా (20) మోస్తరు స్కోర్ నమోదు వద్ద ఔటయ్యారు. లక్నో బౌలర్లు అద్భుతం వేసి బ్యాటర్లు అందరినీ వెనక్కి పంపించేశారు. లక్నో బౌలర్లు బ్రిజేష్ శర్మ, జోఫ్రా ఆర్చర్, బర్గర్ వరుసగా రెండేసి వికెట్లు తీసి అదరగొట్టారు. స్వల్ప లక్ష్య ఛేదనకు బరిలో దిగిన లక్నో సూపర్‌జియాంట్స్ భారీగా విఫలమైంది. 18 ఓవర్లు పూర్తి చేసుకుని 119 పరుగులు మాత్రమే చేసింది. మిచెల్ మార్ష్ మినహా దాదాపు ఏ ఒక్క బ్యాటర్ సమీక్ష చేయనున్నారు. ఆయుశ్ బదౌనీ, రిషబ్ పంత్, మర్‌క్రమ్ ఇలా ముగ్గురికి ముగ్గురు ఒక్క పరుగు కూడా చేయకుండా డకౌట్‌గా వెళ్లిపోయారు. 41 బంతుల్లో మార్ష్ 55 పరుగులు చేసి అర్ధ సెంచరీ నమోదు చేశాడు. అనంతరం నికోలస్ పూరన్ (22), హిమ్మత్ సింగ్ (15) కొంత పోరాడినా విజయానికి కావాల్సిన పరుగులు సాధించలేకపోయారు. ముకుల్ రాయ్, హిమ్మత్ సింగ్ దూకుడుగా ఆడారు. ఛేదనకు దిగిన లక్నో బ్యాటర్లను లక్నో సూపర్ జియాంట్స్ అద్భుతంగా బౌలింగ్ వేసి అన్నీ వికెట్లు తీశారు. జోఫ్రా ఆర్చర్ మూడు వికెట్లు, నంద్రే బర్గర్ రెండు వికెట్లు టపాటపా పడగొట్టారు. ఈ సీజన్‌లో వరుసగా రెండు ఓటములు చెందిన రాజస్థాన్ రాయల్స్ లక్నో గడ్డపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. విజయంతో రాజస్థాన్ రాయల్స్ తమ ర్యాంకును మెరుగుపర్చుకోగా.. ఐదో ఓటమిని ఖాతాలో వేసుకున్నారు. సీజన్‌లో మొత్తం ఏడు మ్యాచ్‌లు ఆడిన లక్నో సూపర్ జియాంట్స్ 2 విజయాలు, ఐదు పరాజయాలతో కొనసాగుతోంది. ఇది వరకు వచ్చు వరుసగా నాలుగు పరాజయం పొందడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నా. ఏడు మ్యాచ్‌లు ఆడిన రాజస్థాన్ రాయల్స్ 5 విజయాలు, రెండు పరాజయాలు సాధించింది. వరుసగా రెండు ఓటముల అనంతరం రాజస్థాన్ గొప్పగా పుంజుకుని ఆడింది.



## నండ్రే బర్గర్‌పై మ్యాచ్ రిఫరీ చర్యలు

ఐపీఎల్ నిబంధనలను ఉల్లంఘించిన రాజస్థాన్ రాయల్స్ పేసర్ నంద్రే బర్గర్‌పై మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బర్గర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించారు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నంద్రే బర్గర్(2/27) మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్‌ను డకౌట్ చేయడంతో పాటు హాఫ్ సెంచరీతో క్రీజులో పాతుకుపోయిన మిచెల్ మార్ష్(55)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్‌వైపు మలుపు తిప్పాడు. ఈ వికెట్లను బర్గర్ అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ప్రత్యర్థి ఆటగాళ్లను దూషిస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఈ వ్యవహారంపై అంపైర్ల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన మ్యాచ్ రిఫరీ బర్గర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించాడు.ఈ మేరకు ఐపీఎల్ ఓ ప్రకటనను విడుదల చేసింది. ‘రాజస్థాన్ రాయల్స్ బౌలర్ నంద్రే బర్గర్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించాం. ఒక డీమెరిట్ పాయింట్‌ను అతని ఖాతాలో చేర్చాం. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలింది. ఆర్టికల్ 2.5 ప్రకారం మరో ఆటగాడిని కించపరిచేలా ప్రవర్తించడం, అనుచిత ప్రవర్తన , భాష ఉపయోగించినట్లు తేలితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బర్గర్ లెవల్ 1 ఉల్లంఘనకు పాల్పడినట్లు మ్యాచ్ రిఫరీ తీసుకున్న తుది నిర్ణయంతో ఈ జరిమానా విధించడం జరిగింది.’అని ఐపీఎల్ తమ ప్రకటనలో పేర్కొంది.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 40 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

## ఈ అవార్డు గుజరాత్ మంత్రికి అంకితమిస్తున్నా- రవీంద్ర జడేజా

లఖ్?నవూ సూపర్ జెయింట్స్?తో జరిగిన లో స్కోరింగ్ మ్యాచ్?లో రాజస్థాన్ రాయల్స్ భళా అనిపించింది. బ్యాటుతో తడబడ్డా బంతితో రాణించిన రాజస్థాన్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా ఆర్?రౌండ్ ప్రదర్శనతో రాణించి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో అతడికి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అయితే ఈ అవార్డును అతడు ‘గుజరాత్ విద్యాశాఖ మంత్రి’కి అంకింతం ఇచ్చాడు. మ్యాచ్ అనంతరం అవార్డ్? ప్రజెంటేషన్?లో జడేజా కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టు విజయంలో కీలకంగా మారినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు. ‘మ్యాచ్ గెలిపించినందుకు హ్యాపీగా ఉంది. అయితే అవార్డును నేను గుజరాత్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి డెడికేట్ చేస్తున్నా. ఎందుకంటే నేను ఇవాళ అద్భుతమైన ప్రదర్శన చేస్తానని ఆమె నిన్ననే నాతో చెప్పింది. ఆమెకు థాంక్స్?’ అని జడ్డూ పేర్కొన్నాడు. కాగా, ఆ మంత్రి ఎవరో కాదు జడేజా సతీమణి రివాబా జడేజానే!సుదీర్ఘ ఐపీఎల్? కెరీర్?లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకోవడం జడేజాకు ఇది 17వసారి. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కాకుండా ఇతర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ అవార్డు దక్కించుకోవడం మాత్రం ఇదే తొలిసారి. సీఎస్కేకు కాకుండా జడేజా ఇతర ఆయా జట్ల (రాజస్థాన్, కొచ్చి టస్కర్స్ కేరళ, గుజరాత్ లయన్స్)కు 75 మ్యాచ్?ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇక చెన్నై తరఫున 186 మ్యాచ్?ల్లో బరిలోకి దిగగా అందులో 16 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. లఖ్?నవూతో మ్యాచ్?లో పిచ్ బ్యాటింగ్?కు? అంతగా సహకరించలేదు. టాపార్డర్ విఫలమైన వేళ జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో నిలబడి స్కోర్ బోర్డును నడిపించాడు. 29 బంతులు ఆడిన జడ్డూ 43 పరుగులు చేసి నాటౌట్?గా నిలిచాడు.






# రామాయణంలో రావణ, కుబేర యుద్ధం భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్న దర్శకుడు


బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా రూపుదిద్దుకుంటున్న అత్యంత భారీ బ్జడెట్ చిత్రం 'రామాయణం' గురించి ఒక సంచలన వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా రామాయణం కథ అనగానే శ్రీరాముడి బాల్యం లేదా జననంతో మొదలవుతుందని మనందరికీ తెలుసు, కానీ ఈ చిత్రంలో దర్శకుడు నితీష్ తివారీ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో రావణుడిగా నటిస్తున్న కన్నడ సూపర్ స్టార్ యష్ పవర్‌ఫుల్ ఎంట్రీతో, రావణ-కుబేర యుద్ధంతో ప్రారంభం కాబోతుందని తెలుస్తుంది. తన సోదరుడైన కుబేరుడిపై దాడి చేసి, స్వర్ణ లంకను మరియు పుష్పక విమానాన్ని రావణుడు స్వాధీనం చేసుకునే ఘట్టాన్ని అత్యంత భారీ స్థాయిలో వెండితెరపై చూపించబోతున్నట్లు సమాచారం. భారతీయ సినీ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా సుమారు 4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రత్యేక స్క్రీనింగ్‌లో ప్రదర్శించిన 20 నిమిషాల ఫుటేజీ చూసిన విశ్లేషకులు, ముఖ్యంగా లంకా నగరం మరియు రావణుడి యుద్ధ సన్నివేశాల్లోని ఘట్టాలు హాలీవుడ్ స్థాయిని మించి ఉన్నాయని ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. రావణుడి శక్తిని, ప్రతాపాన్ని చూపే ఈ విజువల్ స్పెక్టాకిల్ మొదటి భాగం 2026 దీపావళికి, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వరుస ఫ్లాప్‌లతో శ్రీలీల డిసప్పాయింట్ హిట్‌లు లేకపోవడంతో కెరీర్‌లో ఒడిదుడుకులు



కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా? ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఎ÷-లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా? సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.

# రాకా మూవీలో దీపికదే కీ రోల్‌ఆమె నటించదన్న వార్తలపై టీమ్ స్పందన



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాకా'. భారీస్థాయిలో రూపొందుతోన్న ఈ సినిమాలో బన్నీకి జోడీగా బాలీవుడ్ నటి దీపికా పదుకొణె నటిస్తున్నారు. ఇటీవల ఆమె రెండోసారి తల్లి కానున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సినిమాపై రూమర్స్ మొదలయ్యాయి. షూటింగ్ ఆలస్యం అవుతుందని.. దీపిక స్థానంలో మరో నటిని తీసుకోనున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని 'రాకా' టీమ్ ఖండించింది. సినిమాలో దీపిక పాత్ర నిడివి తగ్గించారనే ప్రచారాన్ని కూడా కొట్టేసింది. సినిమాలో ఆమె పాత్ర కీలకమైనదని షూటింగ్ కూడా అనుకున్న షెడ్యూల్స్ ప్రకారమే సాగుతోందని స్పష్టం చేసింది. రూమర్స్‌ను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో దీపిక కొన్ని క్రేజీ యాక్షన్ సన్నివేశాల్లోనూ నటించనున్నట్లు తెలుస్తోంది. అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆమె ఈ సీక్వెన్స్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమెతో పాటు మరికొందరు హీరోయిన్‌లు కూడా నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రష్మిక, జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా వినిపిస్తున్నప్పటికీ, అధికారికంగా మాత్రం ఇంకా చిత్రబృందం వెల్లడించలేదు. ఇందులో ప్రధాన పాత్రల్లో ఎవరు అతిథి పాత్రల్లో ఎవరనే విషయంపై స్పష్టత రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని లుక్ కోసం అల్లు అర్జున్ రోజూ 3, 4 గంటలు సమయం వెచ్చిస్తున్నారని సినీవర్గాలు చెప్పాయి.

# మెక్సికోలో వారణాసి సీన్స్ ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'కోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్‌పీరియన్స్‌లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ కంటెంట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది సీన్స్‌తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్‌ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరు కానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో విడుదల కానుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ షెడ్యూల్ జరుగుతోంది. అంతర్జాతీయస్థాయిలో భారతీయ సినిమా సత్తాను చాటేలా ఈ సినిమాను రాజమౌళి అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందిస్తున్నారు. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా నటిస్తున్నారు.




# నేను తెరిస్తే అంతే సంగతులు గీతామాధురి యూట్యూబ్ ఇంటర్వ్యూ



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో తన స్వరంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ గాయని గీతా మాధురి మరోసారి వార్తల్లో నిలిచారు. పాటలతోనే కాదు, టీవీ షోలతో, సోషల్ మీడియాలో తన యాక్టివ్‌నెస్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆమె, తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గీతామాధురి ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, అందులో ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రోమోలో గీతామాధురి మాట్లాడుతూ నేను ఎప్పుడో ఒక రోజు కాఫీ షాప్‌కి వెళ్తాను. ఆ రోజే ఏదో ఒక ప్రేమ జంట అక్కడికి వస్తుంది. నేను వెళ్లినప్పుడే ఎవరో ఒకరు దొరుకుతారు. ఇలా చాలా మంది నాకు కనిపించారు' అంటూ నవ్వుతూ చెప్పారు. అయితే ఈ విషయంపై ఆమె చేసిన మరో కామెంట్ సంచలనం సృష్టించింది.నేను చూసిన వాటి గురించి నోరు తెరిస్తే కాపురాలు కూలిపోతాయి అంటూ గీతామాధురి చెప్పడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.గీతామాధురి చెప్పిన ఆ జంటలు ఎవరు? వారు టాలీవుడ్‌కు చెందినవారా? లేక ఆమె వ్యక్తిగత పరిచయాల్లో ఉన్నవారా? అనే విషయంపై నెటిజన్లు చర్చలు మొదలుపెట్టారు. అయితే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే పూర్తి ఎపిసోడ్ విడుదలయ్యే వరకు వేచి చూడాల్సిందే. ఇక గీతామాధురి కెరీర్ విషయానికి వస్తే? ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మరోవైపు పాటలు, టీవీ షోలతో బిజీగా గడుపుతున్నారు. నందు భార్యగా, ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబాన్ని చూసుకుంటూనే తన కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com